# వేగుచుక్క
VC NEWS
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ సోమవారం 27 జూలై 2026
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:04 సంచిక: 20




టీమిండియా క్లీన్ స్వీప్

-2లో

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# భవిష్యత్తు నినాదం ఇదే కావాలి జై యువ

- రాజకీయాల్లో యువశక్తి భాగస్వామ్యమవ్వాలి
- కేంద్రం యువతతో పోరాడితే గెలుపెవరిదో కాలమే నిర్ణయిస్తుంది
- ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల వయోపరిమితి తగ్గింపుపై పార్లమెంట్ సమావేశాల్లో చర్చించాలి
- జాతీయ మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**'జై జవాన్.. జై కిసాన్'తోపాటు ఇకపై 'జై యువ' నినాదంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, యువశక్తిని రాజకీయ వ్యవస్థలో భాగస్వామ్యం చేస్తే.. భారతదేశం ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన దేశంగా ఎదుగుతుందని పేర్కొన్నారు.**



**"వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చి దేశ రైతాంగాన్ని కార్పొరేట్ సంస్థలకు బానిసలుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించింది. అప్పట్లోనే లోక్‌సభలో రాహుల్ గాంధీ ఈ చట్టాలను వ్యతిరేకిస్తూ.. రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న మూడు నల్ల చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల మాటలను కేంద్రం పట్టించుకోకపోవడంతో.. రైతులు వీధుల్లోకి వచ్చి నెలల తరబడి పోరాడారు. చివరకు కేంద్రం ఆ చట్టాలను వెనక్కి తీసుకొని రైతులకు క్షమాపణ చెప్పాల్సి వచ్చింది. ఇప్పుడు పరీక్షలు రాసిన విద్యార్థులు విఫలం కాలేదు.**

హైదరాబాద్: యువతతో పోరాడాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తే.. గెలుపు ఎవరిదో కాలమే నిర్ణయిస్తుందని వ్యాఖ్యానించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం జాతీయ మీడియాతో మాట్లాడారు. దేశంలో యువశక్తి ముందు 56 అంగుళాల ఛాతీ తలవంచిందన్నారు. విద్యా వ్యవస్థలో చోటుచేసుకున్న వైఫల్యాలపై దేశవ్యాప్తంగా యువత పోరాటం చేయడంతోనే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు. పరీక్షల నిర్వహణలో కేంద్రం విఫలం సీబీఎస్ఈ, నీట్ తదితర జాతీయ స్థాయి పరీక్షలను సమర్థంగా నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా విఫలమైంది. ఈ అంశంపై రాహుల్ గాంధీ సహా ప్రతిపక్షాలు పలుమార్లు కేంద్రాన్ని హెచ్చరించినా పట్టించుకోలేదు. దేశ యువత వీధుల నుంచి పార్లమెంట్ వరకు తమ శక్తిని ప్రదర్శించింది. ప్రధానమంత్రి రాజీనామాను యువత కోరుతున్న పరిస్థితుల్లో.. ధర్మేంద్ర ప్రధాన్‌ను తప్పించడం ద్వారా కేంద్రం నష్టనివారణ చర్యలకు దిగింది. అదే సమయంలో విద్యార్థులపై నమోదైన అన్ని కేసులను ఉపసంహరించుకోవాలి. నీట్ లీకేజీ కారణంగా పిల్లలను కోల్పోయిన కుటుంబాలకు కేంద్రం ఆర్థిక సాయం అందించాలి. అదేవిధంగా ప్రధాని మోదీ.. దేశ యువతకు క్షమాపణ చెప్పాలి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 21 ఏళ్ల యువత ఐఏఎస్, ఐపీఎస్‌లుగా, ఫార్చ్యూన్-500 కంపెనీల సీఈఓలుగా రాణిస్తున్నారు. అలాంటి యువత దేశ రాజకీయాల్లో ఎందుకు భాగస్వాములు కాలేరు? కాబట్టి ప్రస్తుత చట్టాలను కూడా కాలానుగుణంగా మార్చాల్సిన అవసరం ఉంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయసును 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు.. శాసనమండలి, రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసే వయసును 30 ఏళ్ల నుంచి 25 ఏళ్లకు తగ్గించాలి. ఈ మేరకు రానున్న అసెంబ్లీ, మండలి సమావేశాల్లో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తాం. పార్లమెంట్ సమావేశాల్లో సీట్ల పెంపు, నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్, ఎన్నికల్లో పోటీచేసే వయోపరిమితి తగ్గింపుపై సమగ్రంగా చర్చించాలి. అవసరమైతే సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని ఏర్పాటు చేసి.. అన్ని రాజకీయ పక్షాలు, భాగస్వామ్య వర్గాల అభిప్రాయాలను తీసుకోవాలి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## కర్ణాటక జలదోపిడీని అడ్డుకోకుంటే పాలమూరు ఎడారే!




**మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి**

**కృష్ణా, భీమాలపై నిర్మించిన బ్యారేజీలను సందర్శించిన భారాస నేతలు**

**భీమాపై గూడూరు వద్ద నిర్మించిన రోడ్డు కం బ్యారేజీ వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న భారాస నేతలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నవీన్‌కుమార్‌రెడ్డి, అంజయ్య యాదవ్, రాజేందర్‌రెడ్డి, పార్టీ శ్రేణులు**

కృష్ణా: కర్ణాటక ప్రభుత్వం చేస్తున్న జలదోపిడీని అడ్డుకోకుంటే భవిష్యత్తులో పాలమూరు ఎడారిగా మారుతుందని మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఎగువన భీమా, కృష్ణా నదులపై నిర్మించిన రోడ్‌కం బ్యారేజీలతో రాష్ట్రానికి సమయానికి నదీజలాలు రావడం లేదన్నారు. కృష్ణానదిపై ఆలమట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచుతూ పోవడంతో మనకు అన్యాయం జరుగుతోందన్నారు. దిగువ రాష్ట్రాలు అధికభాగం భీమాపైనే ఆధారపడ్డాయని,

నదిపై రోడ్‌కం బ్యారేజీలు ఏర్పాటుచేసి నీటిని దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. భీమాపై గూడూరు, కృష్ణాపై గూగల్ వద్ద ఉన్న రోడ్‌కం బ్యారేజీలను ఆదివారం ఉమ్మడి జిల్లా భారాస నేతలు సందర్శించారు. ఇద్దరు మాజీ మంత్రులు మాట్లాడుతూ.. కర్ణాటక ప్రభుత్వం తెలుగు రాష్ట్రాలకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. గతంలో అప్పర్ కృష్ణా ప్రతిపాదనలు తుంగలో తొక్కారని మండిపడ్డారు. జూరాల లక్ష్యం 50 టీఎంసీలు కాగా.. 11 టీఎంసీలకు పరిమితమైందన్నారు. 214 టీఎంసీల సామర్థ్యం ఉన్న శ్రీశైలం నుంచి

235 రోజులు నీరు ఎత్తిపోయొచ్చన్నారు. జూరాలకు ఎంత వరదొచ్చినా 40 రోజులకు మించి ఎత్తిపోయలేమని పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా.. తెలంగాణకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## విద్యార్థుల విజయాన్ని రేవంత్ తన ఖాతాలో వేసుకోవడం సిగ్గుచేటు: కవిత



హైదరాబాద్: విద్యార్థులు సాధించిన విజయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తన ఖాతాలో వేసుకోవడం సిగ్గుచేటని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత విమర్శించారు. యువతకు ఇచ్చిన హామీలపై ఎక్కడ నిలదీస్తారోనని ఊరేగింపులు చేస్తారా? అని ప్రశ్నించారు. తెలంగాణ యువతకు ఎన్నో హామీలు ఇచ్చి మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్‌దని విమర్శించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే వాళ్లు ఆ పార్టీని గద్దె దించడం ఖాయమన్నారు.



## మీరాబాయి గెలుపు.. క్రీడాకారులకు స్ఫూర్తి

కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్: కామన్వెల్త్ క్రీడల్లో భారత్‌కు తొలి స్వర్ణం అందించిన మీరాబాయి చానుకు ఆదివారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అభినందనలు తెలిపారు. మీరాబాయి చాను విజయం దేశానికి గర్వకారణమని, యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తుందని కేంద్రమంత్రి ఆదివారం ఒక ప్రకటనలో కొనియాడారు. మహిళల వెయిట్ లిఫ్టింగ్ 48 కేజీల విభాగంలో చాను 190 కేజీల బరువును ఎత్తి స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. కామన్వెల్త్ క్రీడల్లో మీరాబాయి చాను వరుసగా మూడోసారి గోల్డ్ మెడల్ సాధించడం ఆమె అసాధారణ ప్రతిభకు నిదర్శనమని రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. భవిష్యత్తులో అంతర్జాతీయ వేదికల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



**తెలంగాణలో నేడు, రేపు తేలికపాటి వర్షాలు!**

## పరీక్షల సంస్కరణలకు టాస్క్‌ఫోర్స్



**నందన్ నీలేకని నేతృత్వం.. మరో ఐదుగురు సభ్యులు.. స్వయంగా ప్రకటించిన ప్రధాని**
**పరీక్షల్లో సురక్షిత విధానాన్ని తీసుకువస్తామని వెల్లడి**
**విద్యార్థులపై పోలీసుల చర్యను నిలదీయనున్న విపక్షం**
**పార్లమెంటులో చర్చకు రాహుల్ గాంధీ నోటీసు**

దిల్లీ: జాతీయ పరీక్షా సంస్థ (ఎన్‌టీఏ) నిర్వహించే పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీని నివారించేందుకు ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. దీనికి ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వం వహిస్తారని చెప్పారు. ఆదివారం సాయంత్రం వీడియో సందేశంద్వారా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో సాంకేతికతను గరిష్ఠంగా వినియోగించుకోవడం, విస్తృత.. పారదర్శకమైన వ్యవస్థను తీర్చిదిద్దడానికి కావాల్సిన సలహాలను టాస్క్‌ఫోర్స్ ఇస్తుందని తెలిపారు. ఇస్రో మాజీ ఛైర్మన్ ఎస్.సోమనాథ్ సహా వేర్వేరు రంగాలకు చెందిన నిపుణులు దీనిలో సభ్యులుగా ఉంటారని చెప్పారు. ఆధార్ ప్రాజెక్టు కోసం యూపీయే ప్రభుత్వ హయాంలో 'భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ' (ఉడాయ్) ఛైర్మన్‌గా నీలేకని పని చేశారు. సాంకేతిక కోణంలో ప్రక్షాళన టాస్క్‌ఫోర్స్ ఇచ్చే సలహాల ఆధారంగా లోపాలు లేని పరీక్షా వ్యవస్థను ప్రభుత్వం నెలకొల్పుతుందని ప్రధాని తెలిపారు. ప్రధానంగా సాంకేతికత కోణంలో ఎన్‌టీఏ పరీక్షల ప్రక్షాళనకు ఇది దోహదపడుతుందని వివరించారు. తీవ్రంగా దెబ్బతిన్న తన ప్రతిష్ఠను కాపాడుకునేందుకు ఇది మోదీ చేస్తున్న ఉన్నతస్థాయి ప్రయత్నమని కాంగ్రెస్ పెదవి విరిచింది. 2024 జూన్‌లో నీట్-యూజీ సహా వివిధ పరీక్షల నిర్వహణలో విఫలమయ్యాక డాక్టర్ కె.రాధాకృష్ణన్ నేతృత్వంలో ఇలాంటి ఉన్నతస్థాయి కమిటీనే నియమించారని, అది చేసిన 101 సిఫార్సుల అమలు పూర్తికాకముందే ఇప్పుడు మరో కమిటీ అంటున్నారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు. ఎన్‌టీఏకు రెండేళ్లుగా పూర్తిస్థాయి డైరెక్టర్ జనరల్‌నూ నియమించలేకపోయారని ఎద్దేవా చేశారు.

నేడు లోక్‌సభ ముందుకు బిల్లు పరీక్షల లీకేజీపై చట్టాన్ని బలోపేతం చేసేందుకు ఒక బిల్లును ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. పేపర్ లీకేజీ కేసుల విచారణకు ప్రతి రాష్ట్రంలో ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు, రెండు నెలల్లో విచారణ పూర్తి చేయడం, లీకేజీ దోషులకు రూ.10 కోట్ల వరకు జరిమానా వంటివి దీనిలో ఉంటాయి. ఈ సందర్భంగా విపక్షం మూకుమ్మడిగా ప్రభుత్వంపై విరుచుకుపడే అవకాశాలున్నాయి. ఎందుకంటే.. నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై జంతర్ మంతర్‌వద్ద దీక్ష చేపట్టిన విద్యార్థులపై పోలీసులు అతిగా ప్రవర్తించారని విపక్షం మండిపడుతోంది.

శాంతియుతంగా ఉద్యమిస్తున్న వారిపై అనాగరిక దాడికి బాధ్యులెవరో తేల్చాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ లేఖ రాశారు. దీనికి హోంమంత్రి అనుమతించారా అని ప్రశ్నించారు. అత్యంత ప్రాధాన్యం ఉన్న అంశంపై చర్చించాలంటూ తృణమూల్ కాంగ్రెస్ తరఫున సాగరికా ఘోష్ వాయిదా తీర్మాన నోటీసు ప్రతిపాదించనున్నారు. దీక్షను సీజేపీ విరమించినా, మంత్రి రాజీనామా చేసినా ప్రభుత్వంపై పట్టు బిగించడంలో వెనక్కి తగ్గరాదని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. పెల్లెట్ గన్‌ల వినియోగం, సాధారణ దుస్తుల్లో వచ్చిన పోలీసుల దాష్టీకం, విద్యార్థులకు గాయాలు కావడం వంటివి ప్రధానంగా పార్లమెంటులో లేవనెత్తనున్నాయి. విద్యార్థులకు ప్రధాని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయనున్నాయి.

## నిరంతరం సరికొత్త శిఖరాలకు..

రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధిస్తున్నాం మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ



దిల్లీ: రక్షణరంగ ఉత్పత్తుల తయారీ, వాటి ఎగుమతులు, వివిధ దేశాలతో రాజకీయ సహకారం.. ఇలా అన్నింటా మన దేశం నిరంతరం సరికొత్త శిఖరాలకు చేరుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కొద్దిరోజుల క్రితం భారత నౌకాదళంలో ప్రవేశించిన ఐఎన్ఎస్ మహేంద్రగిరి రూపకల్పన దేశీయంగానే జరిగిందని, ఆత్మనిర్భర భారత్ బలం పెరుగుతుందని చెప్పడానికి ఇది నిదర్శనమని తెలిపారు. ఆదివారం 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని మాట్లాడారు. సాహో సైనికా!; 'కొన్ని ప్రత్యేక రోజుల్ని గుర్తుపెట్టుకునేందుకు క్యాలెండర్ చూడాల్సిన పని ఉండదు. అందులో కార్గిల్ విజయ్ దివస్ ఒకటి. మన సైనికుల అసాధారణ శౌర్యపరాక్రమాలను ఈరోజు గుర్తు చేస్తుంది. రక్షణరంగ సాంకేతిక సామర్థ్యాల్లోనూ మనం నిరంతరం బలోపేతం అవుతున్నాం. పినాక దీర్ఘశ్రేణి రాకెట్‌ను, కుశ క్షిపణిని డీఆర్‌డీవో ఇటీవలే విజయవంతంగా పరీక్షించింది. ఈ విజయాలు మన శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల నిరంతర శ్రమను చాటుతున్నాయి. ప్రైవేటు రంగం అభివృద్ధి చేసిన తొలి రాకెట్ విక్రమ్-1 విజయవంతంగా దూసుకెళ్లడం భారతీయులందరికీ గర్వకారణం. అంతరిక్ష రంగంలో ప్రైవేటు వారినీ అనుమతిస్తే ఎలాంటి ప్రతిభ బయటకు వస్తుందనేది మా నిర్ణయంవల్ల ప్రపంచానికి తెలిసింది' అని మోదీ చెప్పారు.

**సరిహద్దు గ్రామాలను యువత సందర్శించాలి**

యువత వర్చువల్ సాధనాలపై ఆధారపడే బదులు దేశాన్ని అర్థం చేసుకునేందుకు, ప్రజల ఆకాంక్షలు తెలుసుకునేందుకు సరిహద్దు గ్రామాలను సందర్శించాలని మోదీ కోరారు. 'వికసిత్ వైబ్రెంట్ విలేజ్' (వీవీవీ) కార్యక్రమం కింద లద్దాఖ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో 74 గ్రామాల్లో పర్యటించి వచ్చిన జెన్-జీ విద్యార్థులతో ఆదివారం ఆయన ముచ్చటించారు.

సరిహద్దు గ్రామాల ప్రజలకు తమకంటే దేశమే ఎక్కువని చెప్పారు. తెలంగాణకు చెందిన భవ్య సహా పలువురు తమ అనుభవాలను ప్రధానికి వివరించారు.

